

పోలీసుల అదుపులో యువకుడు

బోథ్, జూలై 29: మండలంలోని గుట్టపక్క తండా గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఆదివారం సాయంత్రం హరిసింగ్ అనేవ్యక్తిని తీసుకువెళ్లినట్లు తెలిసింది. అతని సెల్‌ఫోన్‌ను తీసుకున్న పోలీసులు కాల్‌లిస్టు పరిశీలించగా గంజాయి స్మగ్లర్ నెంబర్లు ఉన్నట్లు సమాచారం. ఈ విషయాన్ని గ్రామస్థులను అడుగగా పోలీసులు తీసుకు వెళ్లిన మాట వాస్తవమేనని, ఎక్కడి పోలీసులనే విషయం తమకు తెలియదన్నారు. స్థానిక ఎస్సైని అడుగగా తమకు ఎలాంటి సమాచారం లేదన్నారు.

పంటల లెక్క పక్కానేనా?





● పంటల వివరాలను నమోదు చేస్తున్న వ్యవసాయ శాఖాధికారులు

- క్షేత్ర స్థాయిలో మొదలైన పంటల వివరాల సేకరణ
- కురుస్తున్న వానలతో రైతువేదికల్లోనే వివరాలు సేకరిస్తున్న అధికారులు
- అధికారుల అంచనా ప్రకారమే పంటల కొనుగోళ్లు
- ఏటా తలకిందులవుతున్న వ్యవసాయ శాఖ అంచనాలు
- జిల్లాలో 5లక్షల 65వేల ఎకరాల సాగు విస్తీర్ణం

ఆదిలాబాద్, జూలై29 (ఆంధ్రజ్యోతి): ప్రతి యేడు మాదిరిగానే ఈ సారి వ్యవసాయ శాఖ పంటల సాగు వివరాల నమోదు ప్రక్రియను ప్రారంభించింది. ఇప్పటికే పంటల సాగు పూర్తి కావడంతో క్షేత్ర స్థాయిలో అధికారులు వివరాలను సేకరిస్తున్నారు. ఈ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 5లక్షల 65వేల ఎకరాలల్లో వివిధ రకాల పంటలు సాగయ్యే అవకాశం ఉన్నట్లు అంచనా వేస్తూ అధికారులు వానాకాల సాగు ప్రణాళికను సిద్ధం చేశారు. దీనాధారంగానే అధికంగా పత్తి పంట 4లక్షల 36వేల ఎకరాలు కాగా, కంది 60వేల ఎకరాలు సోయా82వేల ఎకరాలు, మిగిత ఎకరాల్లో ఇతర పంటలు సాగయ్యే అవకాశం ఉందని అంచనా వేశారు. అయితే క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితుల ఆధారంగా పంటల సాగు వివరాలను సేకరిస్తున్నారు. ఇప్పటికే 3లక్షల 60వేల ఎకరాలల్లో పంటల సాగు వివరాలను సేకరించినట్లు తెలుస్తోంది. మిగతా పంటల వివరాలను ఆగస్టులోపు పూర్తి చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. అయితే కొంత మంది అధికారులు క్షేత్ర స్థాయికి వెళ్లకుండానే పంటల సాగు వివరాలను అంచనా వేస్తున్న ట్లు సమాచారం. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడడంతో మండల స్థాయి అధికారులు చెప్పిందే లెక్కాగా మారుతుందన్న వాదనలు వినిపిస్తున్నాయి. ప్రతి యేటా నామమాత్రంగానే సాగు వివరాలను చేపట్టడంతో కొనుగోళ్ల సమయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

ఆటంకంగా మారిన వర్షాలు..

జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు పంటల సర్వేకు ఆటంకంగా మారిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మారుమూల గ్రామాల్లో అడుగుతీసి అడుగు వేసే పరిస్థితులు లేక పోవడంతో క్షేత్ర స్థాయి పరిశీలనకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో పంటల వివరాల సేకరణ నామమాత్రంగానే కొనసాగుతునట్లు తెలుస్తోంది. మండల స్థాయి అధికారులు (ఏఈఓ) పంట క్షేత్రాలకు వెళ్లి వివరాలను సేకరించాల్సి ఉన్న కొన్ని మండలాల్లో మాత్రం అలాంటి పరిస్థితులు కనిపించడం లేదంటున్నారు. భూసర్వే వివరాల ఆధారంగా పంటల రకం, విస్తీర్ణం, రైతు వివరాలను సేకరించాల్సి ఉంటుంది. కానీ సమయానికి రైతులు అందుబాటులో లేక పోవడంతో ఖచ్చితమైన వివరాలను సేకరించడం కష్ట సాధ్యంగానే కనిపిస్తోంది. ఏదో చుట్టు పక్కల రైతులు చెప్పిన వివరాల ప్రకారమే పంటల సాగు వివరాలను నమోదు చేస్తున్నట్లు సమాచారం. కొన్ని గ్రామాల్లోనైతే అధికారులు పెద్ద రైతుల వద్దకు వెళ్లి పంటల వివరాలను నమోదు చేస్తున్నట్లు తెలుస్తోంది.

పంట కొనుగోళ్లలో గందరగోళం..

వ్యవసాయ శాఖ సేకరించిన పంటల సాగు వివరాల ప్రకారమే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాళ్లను ఏర్పాటు చేస్తారు. అయితే పంటల సాగు వివరాలకు, వస్తున్న దిగుబడులకు ఏ మాత్రం పొంతన లేకుండానే పోతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రతి సారి అధికారుల అంచనాలు తారుమారు కావడంతో గందరగోళ పరిస్థితులకు దారి తీస్తోంది. ఉదాహరణకు గత ఏడాది జిల్లాలో 4లక్షల 12వేల ఎకరాలల్లో పత్తి పంట సాగైనట్లు వ్యవసాయ శాఖాధికారులు లెక్కలు వేశారు. దీంతో 28లక్షల క్వింటాళ్ల వరకు పత్తి దిగుబడులు వస్తాయని అంచనా వేశారు. కానీ సీసీఐ, ప్రైవేట్ కొనుగోళ్లను కలుపుకొని 21లక్షల క్వింటాళ్ల పత్తి దిగుబడులు వచ్చినట్లు మార్కెటింగ్ అధికారులు పేర్కొంటున్నారు. ఈ యేడు ప్రారంభంలోనే అధికారుల అంచనాలు తారుమారు కావడంతో విత్తనాల కొరత తీవ్రంగా ఏర్పడింది. జిల్లా రైతుల ఆందోళనలు రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. మళ్లీ పంటల సాగు వివరాల సేకరణలోను అదేతంతు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది.

దళారుల ముందు చూపు..

పంటల సర్వే పై దళారులు ముందు చూపుతో వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. పంటలను సాగు చేయని రైతుల పేరిట తప్పుడు వివరాలను నమోదు చేయిస్తున్నట్లు సమాచారం. కొనుగోళ్ల సమయంలో బినామీ రైతుల పేరిట పంట దిగుబడులను అమ్ముకునేందుకు ప్లాన్ చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. రైతుల వారీగా పంట వివరాలను సేకరించి కొనుగోళ్లను ప్రారంభించిన దళారి దందా తప్పడం లేదు. కొందరు దళారులు రైతుల వద్ద ముందే తక్కువ ధరకు పంటలను కొనుగోలు చేసి తిరిగి అదే రైతుల పేరిట ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు పంట దిగుబడులను తరలించి అమ్మేసుకోవడం అలవాటుగానే మారింది. పట్టాపాస్ పుస్తకం ఉంటే చాలు అధికారులతో కుమ్మకవుతున్న దళారులు పంటల వివరాలను నమోదు చేయించడం పరిపాటిగానే మారింది. ప్రతిసారి రైతులకు మాయ మాటలు చెబుతున్న దళారులు కొంత డబ్బును ఆశ చూపుతూ ప్రభుత్వ కొనుగోళ్లలో చక్రం తిప్పుతున్నారు. దీంతో దళారి దందాకు అడ్డుకట్ట పడడం లేదు. ప్రారంభంలోనే పంట వివరాలను పకడ్బందీగా చేపడితే భవిష్యత్తులో ఇబ్బందులు ఉండవన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

పంటల సర్వే కొనసాగుతోంది..
:రమేష్‌కుమార్ (ఏడీఏ, ఆదిలాబాద్)

జిల్లా వ్యాప్తంగా కొద్ది రోజులుగా పంటల నమోదు కార్యక్రమం కొనసాగుతోంది. రైతుల వారీగా పంటల సాగు వివరాలను సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయడం జరుగుతోంది. క్షేత్ర స్థాయిలోకి వెళ్లి పంట వివరాలను సేకరించాలని సిబ్బందిని ఆదేశించడం జరిగింది. పకడ్బందీగానే పంట వివరాలను సేకరిస్తున్నాం. ఇప్పటికే సగానికి పైగా పంట వివరాలను నమోదు చేయడం జరిగింది. త్వరలోనే పంట వివరాల నమోదు కార్యక్రమాన్ని పూర్తి చేస్తాం.



● ఇటీవల భీంపూర్ మండలంలో పంట వివరాలను పరిశీలిస్తున్న కలెక్టర్



ప్రాజెక్టులకు జలకళ..



నిండుకుండలా కరత్వాడ ప్రాజెక్టు



ఉప్పొంగి ప్రవహిస్తున్న పొచ్చెర జలపాతం

బోథ్, జూలై 29: మండలం ఎగువ ప్రాంతంలో ఉన్న మహారాష్ట్రలో మూడురోజులుగా భారీవర్షాలు కురవడంతో కరత్వాడ ప్రాజెక్టు నిండుకుండలా మారింది. ఫలితంగా ప్రాజెక్టు అలుగుపైనుంచి పొంగిపొరలడంతో పర్యాటకులు ప్రాజెక్టు వద్దకు వచ్చి అందాలు తిలకిస్తున్నారు. పచ్చని ప్రకృతి మధ్య జలపాతం నుంచి నుంచి గలగల పారుతూ పొచ్చెర గ్రామం మీదుగా వచ్చే చిన్న వాగు నీటిని తనలో కలుపుకుని ఉరకలు వేస్తూ జలపాతంలోకి దూకుతుండటం పర్యాటకులను మంత్ర ముగ్ధులను చేస్తుంది. వర్షం జోరు తగ్గడంతో పర్యాటకులు బొంతల సీమలోని అందాలను కనులారా వీక్షించేందుకు వస్తున్నారు. అయితే పర్యాటకులకు ఇబ్బందులు రాకుండా స్థానిక పోలీసులు తగు సూచనలు చేస్తున్నారు. ఇరువురు పోలీసులు అటవీశాఖ వారితో కలిసి ఇక్కడే విధులు నిర్వహిస్తున్నారు. మరోవైపు వచ్చే పర్యాటకులకు పోలీసులు పలు సూచనలు చేస్తున్నారు. ఫ్లో ఎక్కువగా ఉందని జలపాతం దగ్గర వరకూ వెళ్లవద్దని పోలీసులు పేర్కొంటున్నారు. సెల్ఫీలు తీసుకునే సమయంలో జాగ్రత్తలు పాటించాలని పర్యాటకులకు పోలీసులు ఈ సందర్భంగా సూచిస్తున్నారు.



జలపాతం వద్ద పర్యాటకుల తాకిడి

అత్యవసరమైతేనే వాగు దాటాలి



కన్నాపూర్ వాగువద్ద తాళ్ళుకట్టిన పోలీసులు

ఇంద్రవెల్లి, జూలై 29: మారుమూల గ్రామీణప్రాంత ప్రజలు అత్యవసరమైతేనే గ్రామస్తుల సహాయంతో వాగులు దాటాలని ఎస్సై దుబ్బాక సునీల్ అన్నారు. సోమవారం ఎన్‌డీఆర్‌ఎఫ్ పోలీసుబృందంతో కలిసి సిరికొండ మండలంలోని కన్నాపూర్ గ్రామం వాగువద్ద తాళ్ళు కట్టి ఇంద్రవెల్లి మండలంలోని గోపాల్‌పూర్, గోపాల్‌పూర్‌గూడ గ్రామాల ప్రజలకు రాకపోకలు సాగించడానికి ఏర్పాట్లు చేశారు. గ్రామీణ ప్రాంత ప్రజలు వర్షకాలంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎలాంటి సమస్య వచ్చినా మండల అధికారులు, స్థానిక పోలీసు అధికారుల దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సిరికొండ మాజీజడ్పీటీసీ కుమ్ర రఘురాం, డీడీఆర్‌ఎఫ్, పోలీసు సిబ్బంది తదితరులున్నారు.

రుణాల పేరుతో మోసం.. బాధితుల ఫిర్యాదు

బోథ్, జూలై 29 : మండలంలోని సోనాల గ్రామానికి చెందిన ఇరువురు మహిళలని ఇచ్చోడ మండల కేంద్రంగా కొనసాగుతున్న ఓ మైక్రోఫైనాన్స్ వారు మోసం చేశారు. 40 వేల రూపాయల రుణం ఇప్పిస్తామని వారి వేలిముద్రలు తీసుకుని సంబంధిత మేనేజర్ అకౌంట్‌లోకి డబ్బులను మార్చుకున్నారు. రుణం ఇంకా మంజూరు కాలేదంటూ మహిళలను కార్యాలయం చుట్టూ తిప్పు కున్నారు. తీరా ఇన్‌స్టాల్‌మెంట్‌లు కట్టాలంటూ సంబంధిత మహిళల ఫోన్‌కు మెసేజ్ రావడంతో దొంగతనం బయటపడింది. దీంతో మహిళలు జరిగిన మోసాన్ని సంబంధిత ఫైనాన్స్ పైస్థాయి అధికారులు దృష్టికి తీసుకువచ్చారు. దీంతో విషయం బయటకు చెప్పవద్దని మీ డబ్బులు మీకు ఇప్పిస్తామంటూ మహిళలను నమ్మించే ప్రయత్నం చేశారు. మహిళలు వీరి మాట వినకుండా స్థానిక పోలీస్ స్టేషన్‌లో రెండు రోజుల క్రితం ఫిర్యాదు చేశారు. అయితే తమ ఉపాధి హామీ డబ్బులు సైతం కాజేశారని మహిళలు ఆరోపిస్తున్నారు.

విజృంభిస్తున్న విషజ్వరాలు

- రిమ్స్‌లో పెరిగిన రోగుల తాకిడి
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు



ఓపీ నమోదు విభాగం వద్ద రద్దీ



మందుల కోసం బారులు తీరిన ప్రజలు

ఆదిలాబాద్ రూరల్, జూలై 29 : ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రిమ్స్‌లో సోమవారం రోగుల తాకిడి పెరిగింది. జ్వరాలు, జలుబు, దగ్గు తదితర రోగాలతో సతమతమవుతూ రిమ్స్‌ఆస్పత్రిని ఆశ్రయిస్తున్నారు. ఆస్పత్రిలోని ఔట్ పేషెంట్ బ్లాక్‌లోని ఓపీ నమోదు విభాగం వద్ద ప్రజల రద్దీ నెలకొంది. ఇది వరకు ప్రతి రోజు 800 నుంచి వెయ్యి మంది రోగులు వస్తుండగా ప్రస్తుతం ఆ సంఖ్య 1200కు దాటింది. ప్రస్తుతం వర్షాలు తగ్గుముఖం పట్టడంతో, వ్యాధులు మరింత సంక్రమించే అవకాశం ఉందని ప్రజలు జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. రిమ్స్‌కు అదనంగా 8 మంది ఫార్మాసిస్టులు ఆదిలాబాద్ రిమ్స్‌కు కొత్తగా 8 మంది ఫార్మాసిస్టులు సోమవారం రిపోర్ట్ చేశారు. ఇది వరకే పనిచేస్తున్న ఇద్దరు ఇతర ప్రాంతాలకు బదిలీ అయ్యారు. కాగా రిమ్స్‌కు మొత్తం 8 మందిని కేటాయించగా ఇప్పటి వరకు ఏడుగురు డైరెక్టర్ రాథోడ్ జైసింగ్‌కు రిపోర్టు చేశారు.

బోథ్: మండలంలో వైరల్ జ్వరాల వ్యాప్తి ఉధృతమవు తుంది. వైరల్ జ్వరాలతో పాటు మలేరియా జ్వరాల ఉధృ తి కొనసాగుతుంది. వ్యాధులు తీవ్రత వల్ల ప్రైవేట్ ఆసు పత్రిలో రోగుల సంఖ్య రోజురోజుకు పెరుగుతుంది. గ్రామాల్లో దోమల తీవ్రత అధికంగా ఉంది. కాని కొన్ని గ్రామ పంచాయతీలలో బ్లీచింగ్ పౌడర్ లేకపోవడంతో పారిశుధ్య పనులు జరగడం లేదు. అనేక గ్రామ పంచాయతీలకు ఇప్పటి వరకు నిధులు మంజూరు కాక పోవడంతో పంచాయతీ కార్యదర్శులు ఇబ్బందులకు గురవతున్నారు. ఏది ఏమైనా అధికారులు పంచాయతీలకు బ్లీచింగ్ పౌడర్ సరఫరా చేయాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



తప్పిన ప్రమాదం

నేరడిగొండ, జూలై29: మండల కేంద్రంలోని వేంకటేశ్వర ఆలయం వద్ద నిర్మల్ నుంచి ఆదిలాబాద్‌కు వెళ్లే ఆర్టీసీ బస్సు ముందరి భాగం టైర్ అకస్మాత్తుగా పగిలి పోవడంతో డ్రైవర్ అప్రమత్తమై చాకచక్యంతో బస్సును ఆపి బస్సులో ఉన్న ప్రయాణికులకు చిన్న గాయం కూడా కాకుండా సురక్షితంగా బస్సును ఆపడంతో పెను ప్రమాదం తప్పింది.

ప్రభుత్వ ఆసుపత్రిలో మందుల కొరత

● బయట మెడికల్ మందుల తేవాలని చిట్టీలు రాస్తున్న ఆసుపత్రి సిబ్బంది ● ఇబ్బంది పడుతున్న రోగులు


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

నార్నూర్, జూలై 29 : భారీ వర్షాలు కారణంగా సీజనల్ వ్యాధులతో ఏజెన్సీ ప్రాంతం జనాల అవస్థలు పడుతున్నారు. వైద్యం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి రోగులు వస్తే వైద్యం అందడం లేదు. డాక్టర్ ఉండరు మిగితా సిబ్బంది వైద్యం చేస్తున్నారు. సోమవారం అత్యధిక రోగులు వచ్చారు. చికిత్సకు కావాల్సిన మందులు లేక ఆసుపత్రి సిబ్బంది వారికి బయట మెడికల్ మందులు తేవాలని చిట్టీలు రాస్తున్నారు. దీంతో రోగులు అనేక ఇబ్బంది పడుతున్నారు. మెట్రో సిట్రిజన్ మందులు లేవు అని సిబ్బంది చెప్పడం. ముందే వర్షాకాలం పైగా చుట్టు పక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో రోగులు వస్తున్నారు. ఇక పైసలు పెట్టి మందులు తెస్తే ఎందుకు ప్రభుత్వ ఆసుపత్రి అని రోగులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. దీనిపై వైద్య శాఖ అధికారులు వెంటనే స్పందించి రోగులు అన్నిరకాల వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలి. దీంతో పాటుశాఖ అధికారులపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని రోగులు అంటున్నారు.


సిబ్బంది రాసిచ్చిన మందుల చిట్టీలను చూపిస్తున్న దృశ్యం

నిండుకుండలా మత్తడి వాగు ప్రాజెక్టు


మొన్నటి మత్తడి వాగు


నేడు నిండుకుండాల మత్తడి వాగు

తాంసి, జూలై 29:మండలంలోని వడ్డాడి గ్రామ సమీపంలో ఉన్న మత్తడి వాగు ప్రాజెక్టు నిండుకుండలా మారింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 277.50 మీటర్లు కాగా ప్రస్తుతం 277.10కి చేరుకుంది. గత 25 రోజుల క్రితం ఎడారిని మరిపించేలా ఉన్న ప్రాజెక్టులో భారీగా వరద నీరు వచ్చి చేరింది. దీంతో ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టంకు చేరుకోవడంతో ఈ పాటికే పలుమార్లు గేట్లను ఎత్తివేసి సుమారు 8 వేల క్యూసెకుల నీటిని బయటకు వదిలారు. ప్రస్తుతం ప్రాజెక్టు వద్దకు పర్యాటకుల సందడి కనిపిస్తుంది.

బాధిత కుటుంబానికి పరామర్శ

సారంగాపూర్, జూలై 29: మండల కేంద్రంలో గల కందిరి నర్సయ్య అనే వృద్ధుడు అనారోగ్యంతో గత వారం రోజుల క్రితం మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని సోమవారం మాజీ జడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి పరామర్శించారు. మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఈయన వెంట నాయకులు దరశథ్ రాజేశ్వర్, ఆది, ఉట్ల రాజేశ్వర్, ముక్తార్‌లు ఉన్నారు.

ఆసిఫాబాద్ రోడ్డును నేషనల్ హైవేగా మార్చాలని వినతి



ఎంపీ గోడం నగేష్‌ని కలిసిన మాజీ చైర్మన్ జాదవ్ శ్రీరామ్

ఉట్నూర్, జూలై 29 : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గుడిహత్నూర్ మండల కేంద్రం నుంచి ఇంద్రవెల్లి ఉట్నూర్ మండలాల మీదుగా ఆసిఫాబాద్ ఆర్ అండ్‌బీ రహదారిని జాతీయ రహదారిగా మార్చాలని ఇంద్రవెల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జాదవ్ శ్రీరామ్ ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్‌ను కోరారు. గుడిహత్నూర్ నుంచి ఉట్నూర్ వరకు, ఉట్నూర్ ఎక్స్ రోడ్డు నుంచి ఆసిఫాబాద్ వరకు ప్రస్తుతం రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో ఉండ డంతో పూర్తిగా గుంతలు పడి అధ్వానంగా తయా రైందన్నారు. ఫలితంగా ఈ రోడ్డుపై ప్రయాణించడం ప్రయాణి కులకు నరకప్రాయంగా మారిందన్నారు. ఈ మేరకు కేంద్రమంత్రిని కలిసి కూడా ఈ రోడ్డును నేషనల్ హైవేలో కలపాలని కోరినందున ఆదిలాబాద్ ఎంపీ సైతం చొరవ తీసుకొని ప్రయత్నిస్తే ప్రజలకు ఇబ్బందులు తొలుగు తాయన్నారు.

రేపు హైదరాబాద్‌లో ధర్నా

ఆదిలాబాద్ అర్బన్, జూలై 29 : మధ్యాహ్న భోజనకార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 31న హైదరాబాద్‌లో ధర్నా నిర్వహించడం జరుగుతుందని మధ్యాహ్నభోజన కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కుంటాలరాములు అన్నారు. సోమవారం రాంనగర్ కాలనీలో కార్మికులతో సమావేశం నిర్వహించారు. హైదరాబాద్‌లో జరిగే సభకు జిల్లా నుంచి అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొనాలని కోరారు. అధికారంలోకి రాకముందు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతిరోజు పిల్లలకు వేడి వేడిగా భోజనం పెట్టే కార్మికులను వదిలి ఒక రాత్రికి సెంట్రలైజ్ కిచెన్ ఏర్పాటు చేయడం సరికాదన్నారు. దీన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోపునూరు చక్రపాణి, కార్మికులు రాంబాయి, శశికళ, పుష్ప, బుచ్చయ్య, సత్తెమ్మ పాల్గొన్నారు.

అంటువ్యాధులపై కళాజాతా ప్రదర్శన



సాకెరలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కళాజాతా బృందం

ఉట్నూర్, జూలై 29 : ఉమ్మడి జిల్లాలోని గిరిజన ప్రాంతాలలో కురుస్తున్న వర్షాలకు అంటువ్యాధులు ప్రబలే అవకాశాలు ఉండడంతో జిల్లా పౌరసంబంధాల అధికారి ఆధ్వర్యంలోని కళాజాత బృందం సోమవారం ఉట్నూర్ మండలంలోని సాకెర గ్రామంలో ప్రజలకు అంటువ్యాధులపై అవగాహన కల్పించింది. ఉట్నూర్ మండలంలోని సాకెర కెగ్రామంలో వర్షాకాల వ్యాధులు జాగ్రత్తలు సంపూర్ణ పారిశుధ్యం, విద్య అవశ్యకత, దోమల నివారణ, వనమహోత్సవంతో పాటు ప్రభుత్వ అమలు చేస్తున్న ఆరుగ్యారంటీలపై ప్రజలకు అవగాహన కల్పించే విధంగా పాటల రూపంలో తెలంగాణ సాంస్కృతిక సారధి టీం లీడర్ చాహకటి రవీందర్ ఆధ్వర్యంలో వివరించారు. కార్యక్రమంలో కళాకారులు గోడంఆశిశ్, శంకర్‌రాథోడ్, గోవిందరావు, మాధురి, రాజు, మురళి, వెంకట్రావ్, రాజలింగు, నగేష్, నరసమ్మ, ధృపద, శ్రీలత పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఆదిలాబాద్ రూరల్, జూలై 29 : ఆకాశవాణి ఆదిలాబాద్ కేంద్రంలో పని చేస్తున్న గుమాస్తా రమేష్(52) మృతిచెందగా ఆయన కుటుంబ సభ్యులను పలువురు పరామర్శించారు. కేంద్రే రామేశ్వర్, టెక్నికల్, ఇంజినీరింగ్ సిబ్బంది ఆయన కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

చదువు గొప్పది

● ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి

ఆదిలాబాద్ అర్బన్, జూలై 29 : చదువు గొప్పదని, సమాజంలో సంక్షేమం అంటే విద్య, వైద్యమేనని, దాన్ని నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తు అంధకారమవుతుందని హైదరాబాద్, ఆర్‌ఆర్, మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి అన్నారు. సోమవారం జడ్పీ సమావేశ మందిరంలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో గురువందనం కార్యక్రమం జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఉపాధ్యాయులు, అధ్యాపకులను ఎమ్మెల్సీ సత్కరించి జ్ఞాపికలను అందించారు. కార్యక్రమంలో ఎంపీ గోడంనగేష్ హాజరై ఉపాధ్యాయ వృత్తిని కొనియడారు. బాధ్యతగా విధులు నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి మాట్లా డుతూ సమాజంలో విద్య ఎంతో గొప్పదన్నారు. కాని ప్రస్థుత ప్రభుత్వం దాన్ని నిర్లక్ష్యం చేస్తుందని ఆరోపించారు. అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన 2 లక్షల 91వేల కోట్ల బడ్జెట్‌లో విద్యారంగానికి కేవలం 4వేల కోట్లనే కేటాయించారన్నారు. ఇందులో 85శాతం వేతనాలకే సరిపోతుందని, 15శాతం నిధులతో ప్రైమరి నుంచి యూనివర్సిటీ వరకు ఉన్న సమస్యలను ఎలా పరిష్కరిస్తారని ప్రశ్నించారు. ఉపాధ్యాయులకు బదిలీలు, ప్రమోషన్లు సహజమని, కాని విద్యార్థిని సమాజంలో మంచి పౌరుడిగా తయారు చేసేలా విద్యాబోధనలు చేయాలన్నారు. ఉపాధ్యాయుల సమస్యలు తనకు తెలుసని చెప్పారు. అనంతరం ఎంపీ గోడంనగేష్ మాట్లాడుతూ సమాజంలో గురుతర బాధ్యత వహిస్తూ మంచిపౌరులను తయారు చేసేది ఉపాధ్యాయులేనని తెలిపారు. విద్యార్థిని సమాజం, పెద్దలు, సంస్కృతి పట్ల అవగాహన కల్పించేలా వారి బోధనలు ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డీఈఓ ప్రణీత, తపస్ రాష్ట్ర అధ్యక్షుడు హన్మంతురావ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవ సురేష్, వక్త ఆర్‌ఎస్‌ఎస్ ఇందర్ విభాగ్ ప్రచారక్ శివకుమార్, తపస్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సునిల్‌చౌహన్, వల్లభోజు గోపికృష్ణ, మనోజ్‌రెడ్డి, మేస్రం రాజ్‌కుమార్, నారాయణ, గోమద్‌రెడ్డి, బత్తులగంగాధర్ పాల్గొన్నారు.

దోమల నివారణపై ప్రత్యేకశ్రద్ధ చూపాలి



తాంసిలో దోమల మందు స్ప్రే చేస్తున్న కార్మికులు

తాంసి, జూలై 29 : ప్రస్తుతం వర్షాకాలం అయినందున దోమల నివారణపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎంపీడీవో మోహన్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం తాంసి, గిరిగావ్ గ్రామాలలో ఆయన పర్య టించారు. దోమల నివారణ విషయంలో సంబంధిత గ్రామాల కార్య దర్శులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ముఖ్యంగా వర్షపు నీరు నిలువ ఉండకుండా పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకునేలా ప్రజలకు వివరించాలని ఆదేశించారు. విధుల విషయంలో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. ముఖ్యంగా గ్రామాల్లో పెంటకుప్పలు లేకుండా చూడాలని పేర్కొన్నారు.

అనాథ యువతికి ఆర్థిక సాయం



ఆర్థిక సహాయం అందిస్తున్న ఎమ్మెల్యే అనుచరులు

ఉట్నూర్, జూలై 29 : కరోనా మహమ్మారి సోకి తల్లిదండ్రులను కోల్పోయిన సీపతి భవాని పెండ్లి కుదరడంతో ఆమె పెండ్లికి ఖర్చుల నిమిత్తం రూ20వేలు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ తనవంతు సహాయంగా అందించారు. సోమవారం ఆమె ఇంటికి వెళ్లి ఆర్థిక సహాయాన్ని ఎమ్మెల్యే బొజ్జుపటేల్ తరపున అనుచరులు సయ్యద్‌కరీం అందించారు. సహాయాన్ని అందుకున్న సీపతి భవాని, ఆమె బంధువులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

లంబాడాల మనోభావాలను దెబ్బతీయొద్దు

● లంబాడా జేఏసీ



మాట్లాడుతున్న బానోత్‌జగన్ నాయక్

ఉట్నూర్, జూలై29 : కొందరు ఆదివాసీ నాయకులు లంబాడా గిరిజనుల మనోభావాలను దెబ్బతీసే విధంగా మాట్లాడడం సరైనది కాదని, లంబాడాలను 1976లో జీవోనెంబర్ 108 ప్రకారంగా అప్పటి కేంద్ర ప్రభుత్వం గిరిజనులుగా గుర్తించిందని, లంబాడా జేఏసీ ఆదిలాబాద్ జిల్లా ప్రధానకార్యదర్శి బానోత్‌జగన్ నాయక్ అన్నారు. సోమవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రాంతంలో ప్రభుత్వం రిజర్వేషన్ సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు. లంబాడాలకు రిజర్వేషన్లు పొందడానికి అన్ని అర్హతలు ఉన్నాయని, ఆచార వ్యవహారాలు, జీవన పరిస్థితులు అన్ని చూసి పార్లమెంటరీ కమిటీ 1976లో ఎస్టీ హోదా కల్పించారని గుర్తు చేస్తున్నామన్నారు. సుప్రీంకోర్టులో ఏ తీర్పు వస్తే ఆ తీర్పును మేము స్వాగతిస్తున్నామన్నారు. అంత వరకు తోటి ఉపకులాల నాయకులు సహనం, సమ న్వయం వహించాలి తప్ప, అనవసరమైన రాద్ధాంతం చేయవద్దని హితవు పలుకుతు న్నామన్నారు. సమావేశంలో గౌరవ అధ్యక్షులు మాజీఎంపీటీసీ జాదవ్‌గోపాలరావు నాయక్, మాజీ ఎంపీటీసీ జాదవ్‌మోహన్‌సింగ్, జేఏసీ ఉపాధ్యక్షులు నేతవాత్ రాందాస్,సభ్యులు రాథోడ్‌రమేష్, బానోత్‌కిషన్‌నాయక్, రాథోడ్ సుధాకర్‌లు పాల్గొన్నారు.

శునకానికి అంత్యక్రియలు



శునకానికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న మాజీజడ్పీటీసీ

తలమడుగు, జూలై 29 : మాజీ జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి గత 16 సంవత్సరాలుగా పెంచుకుంటున్న శునకం ఆదివారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందింది. సొంత గ్రామం అయిన రుయ్యాడి ఫాంహౌస్‌లో శునకానికి సంప్రదాయపరంగా అంత్యక్రియలు నిర్వహించారు. సాంప్రదాయబద్ధంగా అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియల్లో కుటుంబ సభ్యులతో పాటు రుయ్యాడి గ్రామస్తులున్నారు.

'ప్రభుత్వాసుపత్రుల్లో సమస్యలు పరిష్కరించాలి'



ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన సంఘం మండల అధ్యక్షులు

ఇంద్రవెల్లి, జూలై 29 : ప్రభుత్వ ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని, అన్ని రకాల మందులను రోగులకు అందుబాటులో ఉండాలని ఆదివాసిహక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ విద్యార్థి సంఘం మండల అధ్యక్షులు పూర్కచిత్రు డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని పిట్టబొంగురం గ్రామంలోని ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజారోగ్యం పట్ల రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని రకాల వైద్యసేవలను ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో మెరుగైన వైద్యసేవలను బాధ్యతతో అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో మందుల కొరత ఉందని, జలుబు, దగ్గు మందులు దొరకడం లేదన్నారు. సీజనల్ వ్యాధులకు సంబంధించిన అన్నిరకాల మందులు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు.

40 దేశాల నాణాల ప్రదర్శన

బోథ్, జూలై 29 : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో సోమవారం 45 దేశాల పురాతన నాణాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా 1905 నుంచి 1910 వరకు వినియోగంలో ఉన్న బ్రిటిష్ పాలన నాణాలతో పాటు మొగల్ పాలకులు, అక్బర్ 1556 నుంచి 1605 నాటి రాగి నాణాలను ఆ కాలంలో వినియోగించిన 1628 నుంచి 1658 వరకు వినియోగించిన వెండి నాణాలను ప్రదర్శించారు. విద్యార్థులకు గత చరిత్ర గురించి తెలుపాలన్న ఉద్దేశంతో వీటిని ప్రదర్శించడం జరుగతుందని ఆయన వివరించారు. కళాశాల వైస్‌ప్రి న్సిపాల్ రవికుమార్, జూనియర్ వైస్‌ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.



పురాతన నాణాలను ప్రదర్శిస్తున్న ఉపాసెట్టి రాజ్‌కుమార్

జగన్నాథ్‌పూర్ వంతెనపై దిగబడిన లారీ



వంతెన వద్ద దిగబడిపోయిన లారీ

కాగజ్‌నగర్, జూలై 29: కాగజ్‌నగర్ అందవెల్లి జగన్నాథ్‌పూర్ వం తెన అప్రోచ్‌రోడ్డుపై సోమవారం ఉదయం లోడ్‌తో వెళ్తున్న లారీ దిగబడిపోయింది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. గ్రామస్థులు ఎంత ప్రయత్నించినా లారీని బయటకు రాలేదు. దాదాపునాలుగు గంటల వరకు నానా ఇబ్బందులు పడాల్సి వచ్చింది. చివరకు టైర్లకింద మట్టి, రాళ్లు పోయటంతో లారీ బయటకు రావటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

ఎకరానికి రూ.20వేల పరిహారం ఇవ్వాలి



నష్టపోయిన పంటలను పరిశీలిస్తున్న బీజేపీ నాయకుడు సుధాకర్‌రావు

చింతలమానేపల్లి,జూలై 29: వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలకు ఎకరానికి రూ.20వేల నష్టపరిహారం ఇవ్వాలని బీజేపీనాయకుడు పాల్వాయి సుధాకర్ రావు డిమాండ్ చేశారు. మండలంలోని దిందా, కేతినిగ్రామాల్లో ప్రాణహిత పరివాహక ప్రాంతాలు, అలాగే దిందా వాగు ఒడ్డున నష్టపోయిన పంటలను ఆయన, ఆపార్టీసభ్యులతోకలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తక్షణమే పంటనష్టం సర్వేనిర్వహించి రైతులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీశైలం, మల్లయ్య, నవీన్, తుకారాం, బాలయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.

తాగునీటికి తిప్పలు

దహెగాం, జూలై 29: మండలకేంద్రం లోని కొత్తపల్లి ప్రాథ మిక పాఠశాల సమీ పంలోగల చేతిపంపు చెడిపోయింది. దీంతో తాగునీటికి ఇబ్బంది పడుతున్నామని కోయవాడ ప్రజలు వాపోతున్నారు. సమీ పకాలనీల్లోకి వెళ్లి నీటిని తెచ్చుకుంటు న్నామని పేర్కొంటు న్నారు. కాలనీకి మిషన్ భగీరథనీరు చుక్క రావడం లేదని ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి చేతి పంపు బాగు చేయాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు.

రోగులతో కిక్కిరిసిపోతున్న సిర్పూర్(టి) సామాజిక ఆసుపత్రి

సిర్పూర్(టి), జూలై 29: ముసురు వర్షంతో మండలంలోని 16 గ్రామ పంచాయతీల పరిధిలోని 27గ్రామాలకు చెందిన ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. దీనికి తోడు దోమల బెడద, పారిశుధ్య లోపంతో విషజ్వరాలు సోకి ఇంటింటి ఇద్దరు, ముగ్గురు చొప్పున మంచం పడుతున్నారు. కొందరు జ్వరాలతో పాటు వాంతులు, విరేచనాలతో బాధపడుతున్నారు. సిర్పూర్(టి) సామాజిక ఆసుపత్రికి రోజూ ఓపీకింద 300మందికి వరకు వస్తుండగా 40మంది ఇన్‌పేషంట్లుగా చికిత్స పొందుతున్నారు. మండలం నుంచే కాకుండా 108ద్వారా కౌటాల, చింతల మానేపల్లి, బెజ్జూరు మండలాల నుంచి సైతం రోగులు వస్తున్నారు. దీనికి ప్రధానకారణం పారిశుధ్య లోపమని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై సిర్పూర్(టి) ఆసుపత్రి డాక్టర్ జోగేందర్‌ను ఆన్‌లైన్ సంప్రదించగా వేడిచేసి చల్లార్చిన నీటిని తాగాలని, ఇంట్లో పరిసరాలు శుభ్రంగా ఉంచుకో వాలని, దోమల తెరలను వాడాలని సూచించారు. ఇంట్లో ఓఆర్‌ఎస్‌ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. జ్వరంవస్తే ప్రభుత్వఆసుపత్రికి రావాలని సూచించారు.

కన్న కూతురిపై తండ్రి అత్యాచారం

● పాత నేరస్థుడి ఘాతుకం ● నిర్మల్ జిల్లాలో ఘటన

దిలావర్‌పూర్, జూలై 29: కామంతో కళ్లు మూసుకుపోయిన ఓ కసాయి.. రక్తం పంచుకుపుట్టిన కన్న బిడ్డనే కాటేశాడు. నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలంలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి, నిర్మల్ రూరల్ సీఐ శ్రీనివాస్, దిలావర్‌పూర్ ఎస్సై రాజేశ్వర్ గౌడ్‌లు వెల్లడించిన వివరాల ప్రకారం.. దిలావర్‌పూర్ మండలానికి చెందిన ఒక వ్యక్తి (38)కు భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. ఒక వ్యక్తి వృత్తిరీత్యా ఇటుకలు తయారు చేసే కార్మికుడు. కాగా, వీరి కుటుంబం మొదట్లో సారంగాపూర్ మండలం తాండ్రలో ఇటుక బట్టీలో పనిచేసింది. అయితే అక్కడే పనిచేస్తున్న మరో మహిళతో అతడు సన్నిహితంగా ఉంటూ ఆమెతో వివాహేతర సంబంధం కొనసాగించాడు. అయితే ఆ మహిళ మరో వ్యక్తితో చనువుగా ఉందన్న అనుమానంతో 2014లో అదే ఇటుక బట్టీలో ఇటుకతో బాది హత్య చేశాడు. ఆ కేసులో అతడికి జీవితఖైదు జైలు శిక్ష పడింది. అయితే ఆయన ప్రవర్తనను అనుసరించి 5 నెలల క్రితం అధికారులు జైలు నుంచి విడుదలచేశారు. ఆ తర్వాత తన భార్య బిడ్డలతో కలిసి దిలావర్‌పూర్ మండలంలోని ఓ గ్రామానికి మకాం మార్చాడు. అయితే తన ముందే తిరుగుతున్న కన్న కూతురు(14)పై కన్ను పడింది. ఈ నెల 19న రాత్రి సమయంలో కూతురిపై అత్యాచారం చేసేందుకు ప్రయత్నించాడు. దీంతో తప్పించుకుని బాలిక వెంటనే తల్లి దగ్గరికి పరుగెత్తి విషయాన్ని వివరించింది. దీంతో ఇలా చేయొద్దని భర్తను మందలించింది. ప్రాదేయపడింది. అయినా కనికరించని ఆ కసాయి మరింత రెచ్చిపోయి కూతురిపై అత్యాచారం చేశాడు. తండ్రి చేసిన కిరాతకాన్ని తల్లి కూతుళ్లు ఏడుస్తూ తమ కుమారుడికి చెప్పడంతో తల్లి, చెల్లిని తీసుకుని ఆ యువకుడు దిలావర్‌పూర్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు పోక్సో చట్టంతో పాటు మరో నాలుగు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ నెల 27న బాసరకు వచ్చిన సంజీవ్ 28న నిర్మల్ వైపు మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా సిర్గాపూర్ వద్ద పట్టుకొని మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకుని నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

నీటి కుంటలో పడి బాలుడి మృతి

బెజ్జూరు, జూలై 29: అప్పటివరకు ఇంట్లో ఆటలాడుతూ ఆనందంగా గడిపిన బాలుడు ఒక్కసారిగా లేడని తెలియడంతో ఆ కుటుంబంలో తీరని విషాదం నెలకొంది. ఎస్సై విక్రం తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్ర లోని గడిఅహిరి గ్రామానికిచెందిన యూసుఫ్‌అలీ, నస్రీన్ దంపతులు ఆరు నెలల క్రితం మండలంలోని మర్తిడిగ్రామానికి వచ్చారు. గ్రామంలోనే కూలీపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సోమవారం పెద్ద కుమారుడు సుఫి యాన్(6), స్నేహి తుడితో కలిసి ఆటలాడుతూ గ్రామ సమీపంలోని నీటి కుంటలో ప్రమాదవశాత్తు పడ్డాడు. దీంతో స్నేహితుడు ఆఫాన్ గ్రామంలోకి వచ్చి చెప్పడంతో కుటుంబసభ్యులు వెళ్లి చూసే సరికి అప్పటికే సుఫియాన్ మృతి చెందాడు. పొట్ట కూటి కోసం రాష్ట్రం దాటివస్తే తమ కుమారుడు మృత్యువాత పడ్డాడని ఆ కుటుంబం కన్నీరు మున్నీరవుతోంది. మృతుడి తండ్రి యూసుఫ్‌అలీ ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రేపు రెండో విడత రుణమాఫీ: కలెక్టర్



మాట్లాడుతున్న ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, జూలై 29: రుణమాఫీ పథకంలో భాగంగా ఈనెల 30న రెండో విడత రుణమాఫీ కార్య క్రమాన్ని ప్రారంభిస్తామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. రెండో విడతలో లక్ష నుంచి లక్షన్నర వరకు రుణమాఫీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. 30న మధ్యాహ్నం 12 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా రాష్ట్ర మంత్రులు, ఉన్నతాధికారులతో కలిసి రుణమాఫీని లాంఛనంగా ప్రారంభిస్తారని తెలిపారు. రుణమాఫీ ప్రత్యేక సమావేశం నిర్వహించి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టరేట్‌లో వర్చువల్ విధానంలో సీఎం సందేశం అనంతరం జిల్లాలో రైతు రుణమాఫీ రెండో విడత పథకాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. ఈనెల18న మొదటి విడత రుణమాఫీ నిర్వహించిన తరహాలో రెండో విడత రుణమాఫీ అమలు చేస్తామని తెలిపారు. జిల్లాలో రెండోవిడత రుణమాఫీ పథకంలో 14,623మంది రైతులు రూ.153,34,94,379 అందిస్తామన్నారు.

పల్లెపోరులో కదలిక

● పంచాయతీ ఎన్నికలపై సీఎం ప్రకటన
● గ్రామాల్లో వేడెక్కుతున్న రాజకీయ వాతావరణం



వాంకిడి, జూలై 29: పంచాయతీ ఎన్నికలు వీలైనంత త్వరగా నిర్వహిచాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశిం చడంతో జిల్లాలో ఒక్కసారిగా రాజకీయ సందడి నెలకొంది. బీసీ గణన పూర్తయ్యాకే ఎన్నికలు నిర్వహిస్తారన్న కోణంలో ఆలోచించి మరోఆరు నెలలపాటు జరుగవనే అభిప్రాయంతో ఉన్న ఆశావ హుల్లో ప్రభుత్వ నిర్ణయం కదలిక తీసుకువచ్చింది. దీంతో పోటీ చేయడానికి అనుగుణంగా తమ మద్దతుదారులతో సమాలోచనలకు తెరతీయడంతో రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది.

● కొనసాగుతున్న ప్రత్యేక అధికారుల పాలన

అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం నూతన పంచాయతీరాజ్ చట్టం 2018 అమలులోకి తీసుకువచ్చి 2019లో సర్పంచి ఎన్నికలను నిర్వ హించింది. జనవరి1న ఎన్నికల షెడ్యూల్, నోటిఫికేషన్ వెలువడింది. జనవరి 21,25,30తేదీల్లో మూడు దశల్లో పార్టీ రహితంగా ఎన్నికలు నిర్వహించారు. ఫిబ్రవరి1న సర్పంచులు, వార్డు సభ్యులు బాధ్యతలు స్వీకరించారు. 2024ఫిబ్రవరి1తో పదవీకాలం ముగియడంతో జిల్లా లోని 335పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలన కొసాగుతోంది. 2018 ఆగస్టులో రాష్ట్రంలో తొలిసారిగా గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలన వచ్చింది. 2019జనవరి వరకు ఆరునెలల పాటు కొసాగింది. ఆతర్వాత రాష్ట్రంలో ప్రత్యేకపాలన రావడం రెండోసారి.

● వాస్తవానికి గతంలోనే ఏర్పాట్లు..

గతేడాది డిసెంబరులోనే సర్పంచి ఎన్నికలకు రిటర్నింగ్ అధికా రులు, ప్రిసైడింగ్, పోలింగ్ అధికారులు, సిబ్బందిని నియమించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలను జారీచేసింది. లోక్‌సభ ఎన్నికలు రావడంతో ఆప్రక్రియ నిలిచిపోయింది. ప్రస్తుతం సర్పంచుల ఎన్ని కలు నిర్వహించేందుకు మొదట ఓటరుజాబితా సవరణపై దృష్టి సారించనున్నారు. ఆగస్టు మొదటివారంలోగా ఓటరు జాబితా సిద్ధం చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

- 200మంది ఓటర్లకు ప్రిసైడింగ్ అధికారితోపాటు పోలింగ్ అధికారి ఉంటారు.
- 201-400మంది ఓటర్లకు ఒకప్రిసైడింగ్, ఇద్దరు పోలింగ్ అధికారులు, 401నుంచి 650మంది వరకు ప్రిసైడింగ్ అధికారి, ముగ్గురు పోలింగ్ అధికారులు ఉంటారు.
- 650మంది ఓటర్ల కంటే ఎక్కువఉంటే అదనపు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తారు.

● రిజర్వేషన్ల పీటముడితో..

గ్రామపంచాయతీ ఎన్నికలకు రిజర్వేషన్లు ప్రధానఅడ్డంకిగా మారా యి. గతప్రభుత్వం అమల్లోకి తెచ్చిన పంచాయతీరాజ్ చట్టం- 2018 ఎన్నికల స్థానాలకు రిజర్వేషన్లు పదేళ్లపాటు వర్తిస్తాయని పేర్కొంది. తాజాగా రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో పాతరిజర్వేషన్ల ప్రకారమే ఎన్నికలు నిర్వహిస్తుందా..? లేక ఏమైనా మార్పులు చేస్తుందా..? అనే ఆసక్తి సర్వత్రా నెలకొంది. ఒకవేళ చట్టంలో మార్పులు చేస్తే జనాభా ప్రాతిపదికన ఎస్సీ, ఎస్టీ, బీసీ జనరల్ సామాజికవర్గాలకు రిజర్వేషన్లు కేటాయించే అవకాశముంది. ఇందు కోసం ప్రస్తుతం చట్టంలో మార్పులు చేయాలి. ఇది జరగాలంటే మరోకొత్త చట్టాన్ని అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదం పొందాలి. ఈ ప్రక్రియ మొత్తం జరగాలంటే సమయం పడుతుంది. అయితే బీసీగణన ప్రకారం రిజర్వేషన్లను పెంచే అవకాశం లేపో వడంతో పాతవిధానాన్నే కొనసాగించే వీలుందని ప్రజాప్రతినిధులు పేర్కొంటున్నారు.

జిల్లాలో 15జడ్పీటీసీలు, 15ఎంపీపీలు, 123ఎంపీటీసీలు ఉన్నారు. వీరికి జూలై 4న పదవీకాలం ముగిసింది. వీటికి కూడా సర్పంచులకు మాదిరిగానే రెండు పర్యాయాలు రిజర్వేషన్ అమల్లో ఉంది. రెండు నెలల వ్యవధిలో సర్పంచి, ప్రాదేశిక ఎన్నికలు జరిగే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో ఆశావహులు ఇప్పటికే ఓటర్లను తమ వైపు తిప్పుకునే ప్రయత్నాలు ప్రాంభించారు.

andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 27.9 | కనిష్ఠం 25.5



నిర్మల్ జిల్లా వార్తలు
8
మంగళవారం 30 జూలై 2024



ఎన్‌పీడీసీఎల్‌లో ఈ స్టోర్ విధానం

- అవకతవకలకు ఇక అడ్డు
- పేపర్‌లెస్ కార్యకలాపాలు
- ఆన్‌లైన్‌లోనే స్టాక్ వివరాలు
- కొత్త సాఫ్ట్‌వేర్‌తో కార్యకలాపాలు

నిర్మల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : ఎన్‌పీడీసీఎల్ సంస్థ క్రమక్రమంగా వినియోగదారులకు మెరుగైన సేవలను అందించడమే కాకుండా ఆ సంస్థలో ఎలాంటి అవకతవకలకు చోటు లేకుండా చేసేందుకు కొత్త విధానాలను అమలు చేస్తోంది. ముఖ్యంగా ఎన్‌పీడీసీఎల్ సంస్థ వినియోగదారులకు మరింత చేరువయ్యే లక్ష్యంతో అంతా ఆన్‌లైన్ విధానాన్ని తెరపైకి తీసుకువస్తోంది. ఇప్పటికే వినియోగదారుల బిల్లుల చెల్లింపు కోసం ఆన్‌లైన్ పేమెంట్ కోసం క్యూఆర్ పద్ధతిని అమలులోకి తెచ్చిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం క్యూఆర్ కోడ్ విధానంతోనే బిల్లుల చెల్లింపులు ఎక్కువగా జరుగుతున్నాయంటున్నారు. దీంతో పాటు ప్రతీ రోజూ వినియోగదారుల నుంచి వారు ఎదుర్కొంటున్న సమస్యలపై సర్కిల్ వారిగా గ్రీవెన్స్‌ను కొనసాగిస్తోంది. దీంతో వినియోగదారులు తమ సమస్యలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో సైతం అధికారుల దృష్టికి తీసుకువస్తూ ఆ సమస్యలను పరిష్కరించుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే ఎన్‌పీడీసీఎల్ సంస్థ కీలకమైన జిల్లాస్టోర్‌ను సైతం సంస్కరించింది. ఈ స్టోర్ విద్యుత్ పరికరాల పంపిణీ సరఫరాకు అత్యంత కీలకం కావడం గమనార్హం. ఈ స్టోర్ నుంచే అన్ని రకాల సామాగ్రి పంపిణీ చేస్తుంటారు. అయితే గతంలో స్టోర్‌ల నిర్వహణపై పెద్ద ఎత్తున ఆరోపణలు రావడం అలాగే కొన్ని చోట్ల అవకతవకలు జరిగినట్లు ఫిర్యాదులు వెల్లువెత్తిన సంగతి తెలిసిందే. గతంలో జిల్లా కేంద్రంలోని స్టోర్‌ను పలు సార్లు విజిలెన్స్ అధికారులు సైతం తనిఖీలు చేశారు. ఇలాంటి స్టోర్‌ను నియంత్రించేందుకు ఎన్‌పీడీసీఎల్ సంస్థ ఈ-స్టోర్ పేరిట సంస్కరణకు శ్రీకారం చుట్టింది. ప్రత్యేకంగా సాఫ్ట్‌వేర్‌ను రూపొందించి ఈ సాఫ్ట్‌వేర్ ఆధారంగా డిస్ట్రిక్‌స్టోర్స్‌లోని సామాగ్రి వివరాలను అందుబాటులో ఉంచుతున్నారు. ఏఏ ప్రాంతానికి ఎంత సామాగ్రిని పంపిణీ చేశారు. ఆ సామాగ్రిని ఎక్కడెక్కడ ఎలా ఉపయోగించారోననే అంశాలతో పాటు ప్రస్తుతం స్టోర్‌లో ఏఏ సామాగ్రి ఎంతెంత నిల్వ ఉందో అనే వివరాలను సైతం ఎప్పటికప్పుడు నమోదు చేసి అందుబాటులో ఉంచనున్నారు. అలాగే సామాగ్రి పంపిణీ షెడ్యూల్‌ను సైతం ఈ-స్టోర్ విధానంతో అందుబాటులో ఉంచనున్నారు. దీని కారణంగా స్టాక్ కొరతపై అధికారులకు స్పష్టత వస్తుందని పేర్కొంటున్నారు. స్టాక్ వివరాల ఆధారంగా కొత్త పనులు, మరమ్మతు పనులు ఎప్పటికప్పుడు చేపట్టేందుకు అవకాశం ఉంటుందంటున్నారు. ఇప్పటికే గ్రీవెన్స్ పట్ల ప్రజలు సానుకూలంగా స్పందిస్తూ తమ సమస్యల విషయంలో పరిష్కారాన్ని పొందుతున్నారు.

ఈ-స్టోర్‌తో అవకతవకలకు చెక్..

ఎన్‌పీడీసీఎల్ సంస్థలో ఈ స్టోర్ విధానాన్ని మొదలుపెట్టిన కారణంగా అవకతవకలకు చెక్ పడినట్లయ్యిందంటున్నారు. గత కొంతకాలం నుంచి విద్యుత్‌శాఖలోని జిల్లాస్టోర్‌లపై పెద్దఎత్తున ఆరోపణలు వచ్చాయి. ఈ స్టోర్ అవినీతిపై గతంలో విజిలెన్స్ అధికారులు, ఏసీబీ అధికారులు సైతం విచారణలు జరిపిన సంఘటనలున్నాయి. ముఖ్యంగా ఎలక్ట్రికల్ సామాగ్రి పంపిణీ, వినియోగం విషయంలో అవకతవకలు జరుగుతుంటాయని చెబుతున్నారు. మొన్నటి వరకు జిల్లా స్టోర్ ప్రధాన ఆదాయవనరుగా కొనసాగిందన్న విమర్శలున్నాయి. ఇలాంటి నేపథ్యంలో ఆ సంస్థ ఈ-స్టోర్ విధానాన్ని తెరపైకి తెచ్చింది. ఈ విధానం కారణంగా అన్ని వ్యవహారాలు ఆన్‌లైన్‌లోనే జరగనున్నాయి. కాగితాలు, రిజిస్టర్‌ల ప్రమేయం లేకుండా జిల్లా స్టోర్‌కు వచ్చే అన్ని రకాల సామాగ్రి వివరాలు అలాగే ఆ సామాగ్రి పంపిణీ, వినియోగంతో పాటు నిల్వ అంశాలన్నీ ఇక నుంచి ఈ-స్టోర్ పేరిట కొనసాగనున్నాయి. దీంతో జిల్లా స్టోర్ నుంచి సంబంధిత సిబ్బంది తీసుకున్న సామాగ్రిని ఎక్కడెక్కడ వినియోగించారనే అంశంతో పాటు మొత్తం పంపిణీ అయిన సామాగ్రి, ప్రస్తుతం ఉన్న నిల్వ వివరాలు ఉన్నతాధికారులకు సైతం ఉన్న చోటు నుంచే తెలిసిపోనుంది. దీంతో ఇక అవకతవకలకు అవకాశం ఉండబోదని పేర్కొంటున్నారు.

వినూత్నంగా గ్రీవెన్స్ సెల్..

గతంలో మాదిరిగా కాకుండా ప్రతీవారం నిర్వహిస్తున్న గ్రీవెన్స్‌సెల్‌ను పకడ్బందీగా కొనసాగిస్తున్నారు. ప్రతీ సోమవారం సెక్షన్‌ల వారీగా ప్రజల నుంచి ఫిర్యాదులను అలాగే వారి సమస్యలపై వినతిపత్రాలను స్వీకరిస్తున్నారు. దీనికి తోడుగా కస్టమర్ రిసెప్షన్ డెస్క్‌ను కూడా ఏర్పాటు చేశారు. దీంతో వినియోగదారుల సమస్యలను అధికారులు తెలుసుకోవడమే కాకుండా వాటి పరిష్కారానికి అప్పటికప్పుడే చర్యలు తీసుకునే అవకాశం ఏర్పడిందని అంటున్నారు. గత కొద్ది రోజుల నుంచి కొనసాగిస్తున్న ఈ కస్టమర్ డెస్క్ ద్వారా సూపరింటెండింగ్ ఇంజనీరింగ్ స్థాయిలో వినియోగదారుల సమస్యలు పరిష్కారమవుతున్నాయంటున్నారు. జిల్లాలో అన్ని రకాల కనెక్షన్‌లు దాదాపు మూడున్నర లక్షల వరకు ఉన్న కారణంగా వినియోగదారులకు మెరుగైన సేవలను అందించడమే ఎన్‌పీడీసీఎల్ ఈ ప్రత్యేక సంస్కరణను అమలు చేస్తోంది. వినియోగదారుల ఫిర్యాదులపై వివరాలను తెలుసుకునేందుకు ప్రత్యేకయాప్‌ను కూడా రూపొందించారు. ఈ ఫిర్యాదులన్నింటినీ ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేసి ఉన్నతాధికారులకు సైతం అందుబాటులో ఉంచుతున్నారు.



సూపరింటెండింగ్ ఇంజినీర్ ఆపరేషన్ సర్కిల్, నిర్మల్

ఫోన్‌లోనే అంతా..

కాగా ఎన్‌పీడీసీఎల్ సంస్థ గతంలో మాదిరిగా కాకుండా పకడ్బందీ పారదర్శకతను మొదలుపెట్టింది. ప్రస్తుతం సెల్‌ఫోన్ వినియోగం దాదాపుగా అంతటా విస్తరించిన కారణంగా ఆ సెల్‌ఫోన్‌నే కేంద్రంగా చేసుకొని ఎన్‌పీడీసీఎల్ తన సేవలను విస్తరిస్తోంది. ప్రత్యేకయాప్‌లు రూపొందించడం ఆ యాప్‌లను వినియోగదారులకు అందుబాటులోకి తేవడంతో పాటు క్యూఆర్ కోడ్‌ను కూడా అమలులోకి తెచ్చింది. చెల్లింపుల విషయంలో తప్పిదాలు జరగకుండా అలాగే వినియోగదారులు తమ బిల్లుల చెల్లింపుల కోసం కార్యాలయాల చుట్టూ తిరగకుండా క్యూఆర్ కోడ్ ద్వారానే చెల్లింపులు జరిపేట్లు చేస్తోంది. విద్యుత్ కోతలు అలాగే సరఫరాకు ఎదురవుతున్న ఆటంకాలు, ఏ ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయిందనే అంశాలను తన వినియోగదారులకు సెల్‌ఫోన్ ద్వారా తెలుపుతోంది. దీంతో పాటు విద్యుత్ బిల్లుల చెల్లింపుపై వినియోగదారులను అప్రమత్తం చేసేందుకు వారికి ఎప్పటికప్పుడు ఎస్‌యంఎస్‌లు సైతం పంపుతోంది. గతానికి భిన్నంగా ఎన్‌పీడీసీఎల్ సంస్థ చేపడుతున్న కొత్త ఆన్‌లైన్ సంస్కరణలు ఆ సంస్థ పనితీరును మరింత మెరుగుపర్చేందుకు దోహదపడనున్నాయంటున్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ నిరుపేదలకు వరం

- డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు


సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను అందజేస్తున్న కూచాడి శ్రీహరిరావు

నిర్మల్ అర్బన్, జూలై 29 : సీఎం రిలీఫ్‌ఫండ్ నిరుపేదలకు వరమని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు అన్నారు. నిర్మల్ నియోజకవర్గంలోని ఆయా గ్రామాలకు చెందిన 47 మందికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి చెక్కులు మంజూరయ్యాయి. ఈ మేరకు లబ్ధిదారులకు సోమవారం జిల్లా కేంద్రంలోని డీసీసీ క్యాంప్ కార్యాలయంలో చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... వేలాది మంది పేద, మధ్య తరగతి ప్రజలకు సీఎం సహాయనిధి ద్వారా ఆర్థిక చేయూత అందించడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షాన, ప్రజాపాలన చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పీసీసీ సభ్యులు సాధ సుదర్శన్, మండల పార్టీ అధ్యక్షుడు భుజంగ శ్రీనివాస్‌రెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి, వేణుగోపాల్ కుంట, మధుకర్‌రెడ్డి, రాంరెడ్డి, వాజిద్ ఖాన్, కౌన్సిలర్లు మతిన్, వేణు, బాపయ్య, వికాస్‌రెడ్డి, రఫీ, నాయకులు లింగన్న, కరుణాకర్‌రెడ్డి, ఏ. శ్రీకాంత్, బురాజ్, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ కుటుంబానికి పరామర్శ

నిర్మల్ కల్చరల్, జూలై 29 : ఇటీవల మృతి చెందిన ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ కొప్పుల నర్సారెడ్డి కుటుంబాన్ని డీసీసీ అధ్యక్షుడు కే.శ్రీహరిరావు సోమవారం పరామర్శించారు. జాఫ్రాపూర్ గ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. సంతాపం ప్రకటించారు. నాయకులు ఆయన వెంట ఉన్నారు.

పోస్ట్ ఆఫీస్ ఆధ్వర్యంలో బీమా పథకాలపై అవగాహన


గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్న పోస్ట్ ఆఫీస్ అధికారులు

సారంగాపూర్, జూలై 29 : మండల కేంద్రంతో పాటు అడెల్లిలో బీమా పథకాలపై ప్రజలకు పోస్ట్ ఆఫీస్ ఆధ్వర్యంలో అధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం పేద ప్రజలను దృష్టిలో ఉంచుకొని డీసీ డీపీ పథకాన్ని ప్రవేశపెట్టిందని, ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం 350 పొదుపు పథకాల అకౌంట్‌తో పాటు బీమా పాలసీలను చేయించారు. ఈ అవగాహన సదస్సు కార్యక్రమంలో పోస్ట్ ఆఫీస్ అధికారులు దిలీప్ కుమార్, కళ్యాణ్, నరేష్, పవన్, వరప్రసాద్, అబ్బాస్, అజార్, శృతి, సాయికిరణ్, లక్ష్మణ్‌లతో పాటు గ్రామస్థులు ఉన్నారు.

పోలీసుస్టేషను తనిఖీ చేసిన సీఐ


కుంటాల పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న సీఐ నైలు

కుంటాల, జూలై, 29 : కుంటాల పోలీస్‌స్టేషన్‌ను సోమవారం భైంసా రూరల్ సీఐ నైలు తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసుస్టేషన్‌లో రికార్డులను పరిశీలించిన ఆయన నేరాల సంఖ్య పెరగడకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. సిబ్బంది ఎల్లవేళలా అప్రమత్తంగా ఉంటూ గ్రామాల్లో గస్తీ నిర్వహించాలని, అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలుఏర్పాటు చేసపుకునేలా అవగాహన కల్పించాలన్నారు. నూతన చట్టాలపై కూడా ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్సై రజనీకాంత్‌కు మండలంలోని శాంతి భద్రతల గురించి అడిగి తెలుసుకున్నారు.

పద్మనాయక వెలమ కమిటీ భవన నిర్మాణానికి ఐదు లక్షల నిధులు మంజూరు


ప్రొసీడింగ్ కాపీని అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

భైంసా రూరల్, జూలై 29 : మండలంలోని దేగాం గ్రామంలో పద్మనాయక వెలమ కమిటీ భవన నిర్మాణానికి ఐదు లక్షల నిధులు మంజూరయ్యాయి. మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి ప్రొసీడింగ్ కాపీని కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం అన్ని కులాలకు, మతాలకు అతీతంగా సంఘ భవనాలకు నిధులు మంజూరు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెలమ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎన్ఐటీలో సీటు సాధించిన విద్యార్థికి ల్యాప్‌టాప్ అందజేత



తానూర్, జూలై 29 : మండలంలోని ఝరి(బి) తండాకు చెందిన జాదవ్ ధనరాజ్ ఇటీవల నిర్వహించి ఎన్ఐటీ పరీక్షలో స్టేట్ 2218 ర్యాంకు సాధించి బీహార్ స్టేట్‌లోని పాట్నాలో సీటు దక్కించుకున్నారు. కాని ఆర్థిక పరిస్థితుల వలన ముందు చదువుల నిమిత్తం దాతల కోతం వెతుకుతున్నాడు. మీడియా, మిత్రులు ద్వారా గ్రామీణ సపోర్టు ఫౌండేషన్ చైర్మన్ కడారి నరేష్ , స్ఫూర్తి ఫౌండేషన్ చైర్మన్ శ్రీవ్యాల్‌లు అండగా నిలిచారు. సోమవారం హైదరాబాద్‌లోని స్ఫూర్తి ఫౌండేషన్ కార్యాలయంలో విద్యార్థి ఉన్నత చదువులకు ఒక ల్యాప్‌టాప్‌ను, మొబైల్‌ఫోన్‌ను అందజేశారు. భవిష్యత్తులో ఉన్నత చదువుల కోసం సహాయం చేస్తామని మాట ఇచ్చారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి

బీజేపీ ముథోల్ అసెంబ్లీ కన్వీనర్ తాడేవార్ సాయినాథ్

భైంసా, జూలై 29 : పార్టీ శ్రేణులన్ని ప్రణాళిక బద్ధమైన విధానాల ద్వారా స్థానిక సంస్థల ఎన్నికల కోసం సన్నద్ధమవ్వాలని బీజేపీ ముథోల్ అసెంబ్లీ కన్వీనర్ తాడేవార్ సాయినాథ్ అన్నారు. సోమవారం భైంసా ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో జరిగిన భైంసా మండల బీజేపీ కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేఖ విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్ళి ఎండగట్టాలన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఎనిమిది నెలలైనా ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. రుణమాఫీ పూర్తిస్థాయిలో అమలు చేయకుండా రేషన్ కార్డు నిబంధన విధిస్తూ ప్రభుత్వం తప్పించుకునే యోచనలో ఉందన్నారు. కార్యకర్తలు, నాయకులు ప్రజల వద్దకు వెళ్ళి ప్రజా సమస్యలను పరిష్కారం కోసం పాటుపడాలన్నారు. ప్రజాసేవే ధ్యేయంగా పని చేసిన వారికి ఎన్నికల్లో మంచి గుర్తింపు ఉంటుందన్నారు. ఎమ్మెల్యే రామారావు పటేల్ సహకారంతో గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించాల్సిందిగా సూచించారు. కార్యకర్తలందరు కార్యోన్ముఖులై రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపే ధ్యేయంగా పెట్టుకొని ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు తాలోడ్ శ్రీనివాస్, భైంసా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాజేశ్ బాబు, నాయకులు సోలంకీ భీంరావు, బాజీరావు పటేల్ తదితరులతో పాటు పలువురు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ముథోల్ అసెంబ్లీ కన్వీనర్ తాడేవార్ సాయినాథ్

ఉపాధ్యాయురాలి సస్పెన్షన్‌ను ఖండిస్తున్నాం

- సీపీఎస్ ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణారావు

కుంటాల, జూలై, 29 : ఖమ్మం జిల్లా కల్లూరు మండలం పేరువంచ గ్రామ జిల్లా పరిషత్ పాఠశాలలో సీనియర్ ఉపాధ్యాయురాలు శిరీష సస్పెన్షన్ ను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షనర్ స్కీమ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కృష్ణారావు అన్నారు. 9వ తరగతి విద్యార్థులకు జుట్టు బాగా పెరిగిందని ఉపాధ్యాయురాలు జుట్టు కత్తిరించడం డీఈవో ఎలాంటి విచారణ చేయకుండానే సస్పెన్షన్ చేయడం సరికాదన్నారు. ముందుగా షోకాజు నోటీసు ఇచ్చి వివరణ కోరిన తర్వాతనే చర్యలు తీసుకోవాలి కాని అవేమీ ఆలోచించకుండా ఎవరో ఇచ్చిన ఫిర్యాదు మేరకు డీఈవో సస్పెన్షన్ చేయడం సరైన పద్ధతి కాదని, విద్యార్థుల క్రమశిక్షణను దృష్టిలో ఉంచుకొని విద్యార్థులు బాగుండాలనే ఉద్దేశంతో ఉపాధ్యాయురాలు శిరీష పలుమార్లు విద్యార్థులకు జుట్టు కత్తిరించుకోవాలని సూచించినప్పటికి పట్టించుకోకపోవడంతో తన విద్యార్థులు క్రమశిక్షణగా ఉండాలనే ఉద్దేశంతో స్వయంగా ఉపాధ్యాయురాలు జుట్టు కత్తిరించింది. విద్యార్థులపై ప్రేమతోనే ఉపాధ్యాయురాలు స్వయంగా ఇలా చేసింది. కాని డీఈవో ఇలా సస్పెన్షన్ చేయడం సరికాదన్నారు. వెంటనే ఆమె సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

సస్పెండ్ అయిన ఉపాధ్యాయురాలికి మద్దతు : పీఆర్టీయూ

నిర్మల్ కల్చరల్, జూలై 29 : ఇటీవల సస్పెండ్ అయిన ఖమ్మం జిల్లాకు చెందిన ఉపాధ్యాయురాలు శిరీష్‌ను సస్పెండ్ చేయడాన్ని నిర్మల్ పీఆర్టీయూ శాఖ ఖండించింది. జిల్లా అధ్యక్షుడు వై. సాయన్న, ప్రధాన కార్యదర్శి సిహెచ్. హరిప్రసాద్ విడుదల చేసిన ప్రకటనలో ఆమెకు తమ సంఘం మద్దతు ఇస్తుందని తెలిపారు. ఉపాధ్యాయురాలి ఆహార్యాన్ని తప్పు పట్టడం సరికాదని పేర్కొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో పశువుల కొట్టం దగ్ధం


షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైన పశువుల కొట్టం

పెంబి, జూలై 29 : మండలంలోని ఇటిక్యాల్ తండాలో విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో పశువుల కొట్టం దగ్ధమైంది. గ్రామానికి చెందిన గుగావత్ మోతీలాల్‌కు చెందిన పశువుల కొట్టం ఆదివారం రాత్రి షార్ట్ సర్క్యూట్‌తో పశువుల కొట్టం దగ్ధమైన సంఘటన చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పశువుల కొట్టంలో వ్యవసాయ పని ముట్లు, పైపులు, పశువులకు గాయాలైనట్లు, దాదాపు 2 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు తెలిపారు. అధికారులు స్పందించి ఆదు కోవాలని కోరుతున్నారు.

లాడ్జిలో దొంగతనం చేసిన ఇద్దరి అరెస్ట్

నిర్మల్ కల్చరల్, జూలై 29 : జిల్లా కేంద్రంలోని సత్యంలాడ్జిలో దొంగతనానికి పాల్పడ్డ ఇద్దరు దొంగలను సోమవారం అరెస్ట్ చేసినట్లు పట్టణ సీఐ ఎం. ప్రవీణ్‌కుమార్ తెలిపారు. కర్ణాటక రాష్ట్రం బళ్లారికి చెందిన విశ్వనాథ్, రాము పెయింటర్‌లని, జల్సాలకు అలవాటు పడ్డ వీరిరువురు లాడ్జిలోని విజిటర్ల రిజిస్టర్ దొంగిలించారని తెలిపారు. బళ్లారికి చెందిన బసవరాజు అనే వ్యక్తికి ఎక్కువ ధరకు అమ్మి వచ్చిన డబ్బులతో జల్సా చేద్దామని రిజిస్టర్‌తో పాటు కౌంటర్‌లోని 2 వేల రూపాయలు ఈ నెల 27న దొంగిలించారన్నారు. సీసీ కెమెరాల ఆధారంగా వారిని గుర్తించి పట్టుకొని విచారించగా నేరం చేసినట్లు ఒప్పుకున్నట్లు చెప్పారు. గతంలో వీరు వరంగల్, ఆదిలాబాద్ పట్టణాల్లోని పలు లాడ్జిలలో రిజిస్టర్లు దొంగిలించినట్లు పేర్కొన్నారు. వారిని రిమాండ్‌కు తరలించామన్నారు.



అరెస్ట్ అయిన నిందితులతో సీఐ

సంక్షిప్త సమాచారం

నేడు ఖానాపూర్ మున్సిపల్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేత

ఖానాపూర్, జూలై 29 : ఖానాపూర్ మున్సిపల్ పరిధిలో ఇళ్ల పైన, కరెంటు లైన్ల పైన చెట్ల కొమ్మలను తొలగిస్తున్నందున మంగళవారం పట్టణంలో విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు టీజీ ఎన్‌పీడీసీఎల్ ఖానాపూర్ సబ్ ఇంజనీర్ వెంకటేష్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఖానాపూర్ పట్టణంలో నేడు ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. ఖానాపూర్ పట్టణంతో పాటు సుర్జాపూర్ సబ్ స్టేషన్ పరిధిలో సైతం మరమ్మతులు నిర్వహిస్తున్నందున సబ్‌స్టేషన్ పరిధిలోని సుర్జాపూర్, మస్కాపూర్, బాదనకుర్తి, మేడంపెల్లి గ్రామాల్లో మంగళవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఖానాపూర్ పట్టణ ప్రజలతో పాటు సుర్జాపూర్ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల ప్రజలు విద్యుత్ శాఖ అధికారులకు, సిబ్బందికి సహకరించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

ప్రాజెక్టుల్లోకి వచ్చి చేరుతున్న వరదనీరు

నిర్మల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో క్రమం తప్పకుండా వర్షాలు కురుస్తున్నాయి. జిల్లా సగటు వర్షపాతం 3.7 మిల్లీమీటర్లుగా నమోదైంది. ఈ వర్షాల కారణంగా ప్రాజెక్టుల్లోకి వరదనీరు వచ్చి చేరుతుంది. కడెం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 7.603 టీఎంసీలు కాగా ప్రస్తుతం 6.385 టీఎంసీలుగా ఉంది. ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాల కారణంగా ప్రాజెక్టులోకి 5,860 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతుంది. దీంతో కడెం ప్రాజెక్టు ఒక గేటును ఎత్తి 4, 226 క్యూసెక్కుల నీటిని దిగువన గోదావరిలోకి వదులుతున్నారు. ఇదిలా ఉండగా స్వర్ణప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1.484 టీఎంసీలు ప్రస్తుతం 1.172 టీఎంసీలుగా ఉంది. ప్రాజెక్టు ఎగువ ప్రాంతమైన మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాల కారణంగా ప్రాజెక్టులోకి 200ల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుంది. అదేవిధంగా గడ్డెన్నవాగు ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1.852 టీఎంసీలు కాగా ప్రస్తుతం 0.849 టీఎంసీలుగా ఉంది. కాగా ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 260 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుంది.

కుభీర్‌లో వార సంత వేలం

కుభీర్, జూలై 29 : మండల కేంద్రం కుభీర్‌లో ప్రతి గురువారం నిర్వహించే వార సంత, గూడ్స్ వెహికల్స్‌ల నుంచి వసూళ్ల హక్కుని దక్కించుకునేందుకు బుధవారం వేలం పాట నిర్వహించనున్నట్లు ప్రత్యేకాధికారి ఎంపీవో మోహన్‌సింగ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటలకు వేలం నిర్వహించనున్నట్లు, పాల్గొనదలచిన వారు రూ. 10వేలు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందన్నారు.

శిలాఫలకం ధ్వంసం చేసిన వారిపై చర్య తీసుకోవాలి : యూటీఎఫ్

నిర్మల్ కల్చరల్, జూలై 29 : నిర్మల్‌లోని భాగ్యనగర్‌లో యూటీఎఫ్ సంఘభవన నిర్మాణ స్థలంలో శిలాఫలకం ధ్వంసం చేసిన వారిపై చర్య తీసుకోవాలని ఆ సంఘం అధ్యక్షుడు దాసరి శంకర్, ప్రధాన కార్యదర్శి అశోక్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గుర్తుతెలియని వ్యక్తులు ఈ చర్యకు పాల్పడడాన్ని తీవ్రంగా ఖండించారు.